సాక్షి
ఖమ్మం
సోమవారం । 29 । జనవరి । 2024



'నివేదన' ఎప్పుడో..?

ధూప దీప నైవేద్యం పథకం కింద గతేడాది కొత్తగా ఎంపికైన ఆలయాలకు నిధులు రాక అర్చకులు ఇబ్బంది పడుతున్నారు. 10లో



ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు 147 మంది బాల బాలికలు హాజరయ్యారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 17°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం అధికంగా ఉంటుంది.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



ఆలయంలో పోటెత్తిన భక్తులు



ప్రత్యేక క్యూలైన్ ద్వారా వస్తున్న భక్తులు

మార్మోగిన రామనామం

- రామయ్య దర్శనానికి తరలివచ్చిన భక్తజనం
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం రామనామ స్మరణతో మార్మోగింది. వరుస సెలవులు కావడంతో ఆదివారం భారీగా భక్తులు పోటెత్తారు. దీంతో రామాలయం, గోదావరి తీర పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. రెండు రోజులుగా భక్తుల రద్దీతో బేడా మండపంలో నిర్వహించే స్వామివారి నిత్య కల్యాణ వేడుకను చిత్రకూట మండపంలోకి మార్చారు. నిత్య కల్యాణానికి ప్రత్యేక టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు కుటుంబ సమేతంగా హాజరు కావడంతో కూర్చునేందుకు స్థలం లేక నిల్చుని కల్యాణతంతు వీక్షించారు. ఉచిత దర్శనానికి వచ్చే భక్తులు క్యూలైన్లల్లో సుమారు రెండు గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. ప్రధాన ఆలయంలోకి ప్రవేశించే సమయంలో భక్తుల మధ్య తోపులాట జరగడంతో ప్రధాన ఆలయ ద్వారాల వద్ద పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు బారికేడ్లు ఏర్పాటు చేసి క్యూ పద్ధతి పాటించేలా చూస్తున్నారు.

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం

శ్రీసీతారామ చంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం చిత్రకూట మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పర్యాటకుల ఆందోళన

స్వామివారి దర్శనం అనంతరం పాపికొండల విహార యాత్రకు వెళ్తుండడంతో అక్కడ కూడా క్యూ కడుతున్నారు. అయితే కొందరు ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు లాంచీలో పర్యాటక శాఖ కేటాయించిన సీట్ల కంటే ఎక్కువగా టికెట్లు బుక్ చేస్తున్నారు. టికెట్ కొనుగోలు చేసిన వారు పాపికొండల విహార యాత్ర పాయింట్‌కు వెళితే అక్కడి లాంచీ నిర్వాహకులు పరిమితికి మించిన వారిని తిరిగి వెనక్కు పంపిస్తున్నారు. దీంతో కొందరు పర్యాటకులు ఆదివారం పట్టణంలోని ఓ ఆన్‌లైన్ సెంటర్ వద్ద ఆందోళన చేయగా, సదరు నిర్వాహకుడు గుట్టుచప్పుడు కాకుండా వారికి నగదు తిరిగి చెల్లించాడు.

న్యూస్‌రీల్

ఉర్సు ఉత్సవాల్లో మంత్రి తుమ్మల



దర్గాలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న హజ్రత్ సయ్యద్ యాకూబ్ శావలి దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాల్లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ముజావర్ షేక్ హబీబున్, ఆశ్రిఫ్, ఖదీర్, సల్మాన్, నాగుల్‌మీరా, ఖాజామియా, జాకీర్, నవాజ్, షబ్బీర్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఎన్‌సీసీ కవాతులో జిల్లా విద్యార్థిని



ప్రధాని నరేంద్రమోదీతో సాహితి

ఖమ్మం స్పోర్ట్స్ : గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఎన్‌సీసీ కవాతులో నగరంలోని గోర్కి పబ్లిక్ స్కూల్‌కు చెందిన గరిడేపల్లి సాహితి పాల్గొంది. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నివాసంలో జరిగిన అభినందన కార్యక్రమానికి హాజరైంది. కాగా, విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్. పి.గోర్కి, ప్రిన్సిపాల్ జోష్, తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్ తదితరులు అభినందించారు.

లక్ష్యం చేరని మిల్లర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి



రైస్ మిల్లులో బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంరూరల్ : సీఎంఆర్ లక్ష్యం చేరని మిల్లర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. మండలంలోని మంగళగూడెంలో గల రైస్ మిల్లును ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సీఎంఆర్ బియ్యం డెలివరీ లక్ష్యం, ఇంతవరకు అందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎంఆర్ బియ్యం డెలివరీకి ఈనెల 31 వరకు ప్రభుత్వం గడువు విధించినందున ఈ మేరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. వానాకాలం పంటకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బియ్యంపై అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలు దరిచేరని రైస్ మిల్లులపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 3,354.577 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం డెలివరీ చేయాల్సి ఉన్నందున ఈ నెలాఖరుకు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

పలువురు ఎస్‌ఐల బదిలీలు

ఖమ్మంక్రైం : జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖమ్మం రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న షేక్ షకీర్‌ను కల్లూరు ఎస్‌ఐగా, కల్లూరు ఎస్‌ఐ పి.రఘును ఖమ్మం వీఆర్‌కు, రఘునాథపాలెం మండల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న బి.కొండలరావును తల్లాడకు, అక్కడ పనిచేస్తున్న సురేష్‌ను ఖమ్మం వీఆర్‌కు, ఖమ్మం వన్‌టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకటేష్‌ను వీఎం బంజరకు, అక్కడ పనిచేస్తున్న జి.సూరజ్‌ను ఖమ్మం వీఆర్‌కు బదిలీ చేశారు.

'కొరిపల్లి'కి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కొరిపల్లి శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం : ఖమ్మానికి చెందిన దళితరత్న అవార్డు గ్రహీత కొరిపల్లి శ్రీనివాస్‌కు న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ నుంచి కీర్తి పురస్కార్ జాతీయ అవార్డు దక్కింది. కేవీపీ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సంస్థ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ జోసఫ్ పాలంగి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు శ్రీనివాస్ 'సాక్షి'కి తెలిపారు.

ఈ రోడ్లకు మహర్దశ

గ్రామాల్లో పొలాలకు వెళ్లే దారులకు మరమ్మతులు

- ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ ఆదేశం
- ఉపాధి పనుల ద్వారా డొంక రోడ్ల అభివృద్ధి
- సర్వే చేస్తున్న డీఆర్‌డీఏ, రెవెన్యూ అధికారులు



ఖమ్మంరూరల్ మండలంలో డొంక రోడ్డును పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ, రెవెన్యూ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లాలోని డొంకరోడ్ల రూపురేఖలు మారనున్నాయి. అనేక రోడ్లు ముళ్లకంపలు, పిచ్చిచెట్లు పెరిగి, ఆక్రమణలకు గురయ్యాయి. ప్రధానంగా గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లే దారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. వీటిపై జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ రోడ్లను ఉపాధి హామీ పనుల ద్వారా అభివృద్ధి చేయనున్నారు. అలాగే ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశించగా.. డీఆర్‌డీఏ, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత డొంక రోడ్లకు మహర్దశ పట్టనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మేలు జరగనుంది.

డొంక రోడ్ల గుర్తింపు..

ఆక్రమణలను తొలగించి, డొంక రోడ్లకు మరమ్మతులు చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో గ్రామాల వారీగా రోడ్లను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాలో ఉన్న డొంక రోడ్లను ల్యాండ్ సర్వే అధికారులు గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తించి వాటి వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ శాఖల అధికారులకు అందజేస్తున్నారు. రెవెన్యూ అధికారులు గతంలో డొంక రోడ్ల పరిస్థితి ఏంటి..? ఇప్పుడెలా ఉన్నాయి..? ఎంతమేర ఆక్రమణకు గురయ్యాయి..? ఎక్కడి నుంచి ఎక్కడి వరకు రోడ్డుకు మరమ్మతులు చేయాలనే అంశాలపై సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే అనంతరం ఏయే రోడ్లకు ఎక్కడెక్కడ పనిచేయాలనే వివరాలను వారు గ్రామీణాభివృద్ధి అధికారులకు అందజేయనున్నారు. ఆ మేరకు ఉపాధి హామీ కూలీలతో డొంక రోడ్లకు మరమ్మతులు చేయించడంతో పాటు అక్రమణలను తొలగించనున్నారు.

ఎన్నో ఏళ్లుగా..

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలకు వెళ్లే రోడ్లు చాలా వరకు ఆక్రమణలకు గురై చిన్న చిన్న డొంక రోడ్లుగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు సరైన దారి లేక అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం పొలాల్లోకి ఉన్న దారులు ఆక్రమణలకు గురి కావడంతో పాటు వెడల్పు ఉన్న రోడ్లు కూడా చిన్న కాలినడక మార్గాలుగా మారి నడిచేందుకు కూడా వీలు లేకుండా తయారయ్యాయి. ఇక వర్షాకాలంలో రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. అరకలు, ట్రాక్టర్‌లు కూడా పొలాల్లోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పుడు కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో రైతుల కష్టాలు తీరనున్నాయి. ఇక ఆక్రమణకు గురైన డొంక రోడ్లు పూర్తిగా రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

71 రోడ్లు ఆక్రమణ..

జిల్లాలోని పలు మండలాల్లో వివిధ గ్రామాల్లోని 71 డొంక రోడ్లు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. వీటిలో 62 రోడ్లకు ఎక్కడ వరకు ఆక్రమణలు తొలగించాలి, ఏ రోడ్డును మరమ్మతులు చేయించాలనే అంశాలను రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి అధికారులు గుర్తించారు. అత్యధికంగా కల్లూరు, ఖమ్మంరూరల్, ఖమ్మం అర్బన్ మండలాల్లో రోడ్లు ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది.

వారం రోజుల్లో పనులు ప్రారంభం..

డొంక రోడ్ల ఆక్రమణల తొలగింపు, మరమ్మతుల పనులను ఉపాధి కూలీలతో చేయించాలని అధికారులు నిర్ణయించారు. దీని ద్వారా ఉపాధి కూలీలకు పనులు కల్పించడంతో పాటు రోడ్లను బాగు చేసుకోవచ్చని అధికారులు ఆలోచన చేశారు. ఇప్పటి వరకు 62 రోడ్లకు పనులు చేయించేందుకు మార్కింగ్ చేయడంతో వారం రోజుల్లో ఆ రోడ్ల పనుల ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విద్యాచందన కలెక్టర్ ఆదేశాల మేరకు రఘునాథపాలెం, ఖమ్మంఅర్బన్, ఖమ్మం రూరల్ మండలాల్లో రోడ్లను పరిశీలించి కూలీలతో ఎక్కడెక్కడ పని చేయించాలో క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు.

డొంక రోడ్లు బాగు చేస్తాం



జిల్లాలో ఆక్రమణకు గురైన డొంక రోడ్లను ఉపాధి కూలీలతో మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపట్టాం. కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే రోడ్లను గుర్తించి, ఎక్కడెక్కడ పనులు చేయించాలనేది సర్వే చేస్తున్నాం. ఈ పనులతో ఇటు కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు అటు గ్రామాల్లోని రోడ్లు బాగుపడనున్నాయి. త్వరలోనే ఉపాధి కూలీలతో ఈ పనులను చేపట్టనున్నాం.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

జిల్లాలో ఆక్రమణలకు గురైన డొంక రోడ్లు ఇవే..

మండలం	ఆక్రమణకు గురైన రోడ్లు	ఆక్రమణలు తొలగించాల్సిన రోడ్లు
చింతకాని	01	01
ఏన్కూరు	02	02
కల్లూరు	13	08
కామేపల్లి	02	02
ఖమ్మంరూరల్	10	09
ఖమ్మంఅర్బన్	10	10
రఘునాథపాలెం	09	09
కొణిజర్ల	01	01
కూసుమంచి	02	00
మధిర	03	03
ముదిగొండ	05	04
పెనుబల్లి	01	01
సత్తుపల్లి	01	01
తల్లాడ	01	01
తిరుమలాయపాలెం	01	01
వేంసూరు	01	01
వైరా	07	07
ఎర్రుపాలెం	01	01
మొత్తం	71	62

ఏడో గ్యారంటీగా విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలి

టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని



మాట్లాడుతున్న చావా దుర్గాభవాని

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీ ఇవ్వగా.. ఏడో గ్యారంటీగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ప్రభుత్వం విద్యా కమిషన్ ఏర్పాటు చేసి బలోపేతానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దుచేసి, శాస్త్రీయ, లౌకిక విలువలతో కూడిన విద్యా విధానాన్ని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. సర్వశిక్ష, కేజీబీవీ, గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు.

4న జిల్లా కమిటీ సమావేశం..

ఫిబ్రవరి 4న నేలకొండపల్లిలో సంఘం జిల్లా విస్తృత కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్ర నాయకులు చావా రవి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మహబూబ్ అలీ, బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, రంజాన్, సుధాకర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అందని అలవెన్స్‌లు...

- విద్యుత్ ఉద్యోగులకు ఆరు నెలలుగా డీఏ పెండింగ్
- కేటీపీఎస్, బీటీపీఎస్‌లలో పీఎల్ఎఫ్ అలవెన్స్ చెల్లింపులో జాప్యం



కేటీపీఎస్ కర్మాగారం

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న జెన్‌కో సంస్థ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆరు నెలల క్రితమే విడుదల కావాల్సిన ఉద్యోగుల కరువు భత్యం(డీఏ) ఇంకా విడుదల చేయలేదు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా డీఏ చెల్లించాల్సి ఉండగా, స్వయం ప్రతిపత్తి కలిగిన జెన్‌కో సంస్థ డీఏ విడుదలపై నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తోంది. విద్యుత్ కర్మాగారాల్లో అత్యధికంగా ఉత్పత్తి సాధిస్తే ఉద్యోగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి ఏటా అందించాల్సిన పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) అలవెన్స్ పెండింగ్‌లోనే ఉంటోంది. 2018లో నిర్మాణం పూర్తయిన 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం, 1,080 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మణుగూరు బీటీపీఎస్ కర్మాగారంలో ఉద్యోగులకు నేటికీ పీఎల్ఎఫ్ అలవెన్స్ చెల్లించడంలేదు. రెండు కర్మాగారాల్లో ఉత్పత్తి అందుబాటులోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా పీఎల్ఎఫ్ అలవెన్స్ రెండు నుంచి ఐదు శాతం రావడం లేదని తెలుస్తోంది.

ఆర్టిజన్లకు పీఆర్‌సీలో నష్టం

గత పీఆర్సీలో నష్టపోయినట్లు కారుణ్య నియామకాల ద్వారా పోస్టింగ్‌లు పొందిన ఆర్టిజన్లు వాపోతున్నారు. 2023లో మంజూరైన పీఆర్‌సీ కొందరు ఆర్టిజన్లకు అమలు కాలేదు. 2019 నుంచి 2023 మధ్య కాలంలో విధుల్లో చేరినా అరకొర వేతనాలు వస్తున్నాయని ఆర్టిజన్లు వాపోతున్నారు. 1999–2004 మధ్య కాలంలో ఉద్యోగాలు పొందినవారికి ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి పెన్షన్ సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు అమలు చేయలేదు. జెన్‌కో, ట్రాన్స్ కో సీఎండీ, కార్మిక శాఖ ఉన్నతాధికారులకు ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు సమస్యలు విన్నవించినా ఫలితంలేదు.

తోటల్లో 'ఉద్యాన' విద్యార్థులు



పామాయిల్ తోటను సందర్శించిన ఉద్యాన కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: వివిధ రకాలను తోటలను ఉద్యాన కళాశాల విద్యార్థులు సందర్శించారు. హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన 92 మంది విద్యార్థులు మూడు రోజుల క్షేత్ర పర్యటన కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం అశ్వారావుపేటలోని హెచ్‌ఆర్‌ఎస్(ఉద్యాన పరిశోధన స్థానం)ను సందర్శించారు. స్థానికంగా సాగులో ఉన్న ఉద్యాన పంటలైన ఆయిల్‌పాం, కొబ్బరి, కోకో, శతవరి, జామ, మామిడి, అరటి తదితర తోటలను సందర్శించారు.

రైతులతో మాట్లాడి పంటల సాగు విధానం, ఆదాయం, పెట్టుబడి, ఎరువు, నీటి వినియోగం తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. ఉద్యాన పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న మిరియాలు, కాఫీ, తమలపాకు, జీడి మామిడి, సపోటా, జామ పంటలతోపాటు పలు రకాల కూరగాయల పంటలను పరిశీలించారు. కేంద్రంలో జరిగే పరిశోధనలు, నర్సరీ, మామిడి, సపోట, జామ మొక్కలకు అంటుకట్టే విధానం గురించి శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల బృందం స్థానిక ఆయిల్‌పాం నర్సరీ, పామాయిల్ ఫ్యాక్టరీ, కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం, వ్యవసాయ కళాశాలను కూడా సందర్శించింది. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్, టీచింగ్ అసోసియేట్ టి.మమత, ఏఈఓ శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఓఏఐ విజేతలు వీరే..

సింగరేణి(కొత్తగూడెం): కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) సింగరేణి శాఖ ఎన్నికలు ఆదివారం నిర్వహించగా, ఫలితాలు రాత్రి వెల్లడించారు. కొత్తగూడెం ఏరియా అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వెంకటాచారి 100 ఓట్లు సాధించి కిష్టారం ఓసీ అడిషనల్ మేనేజర్ బి.రామకృష్ణపై 44 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ పోస్టులు రెండు ఉండగా, ఐదుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. అజ్మీర శ్రీనివాస్, డి.రమేష్‌బాబు గెలుపొందారు. ఏరియా సెక్రటరీగా అనందేసి ఉపేందర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీ పోస్టులు రెండు ఉండగా, కొమ్మూరి శేషశ్రీ, అలుగోలు ప్రదీప్ కుమార్ గెలుపొందారు. ట్రెజరర్‌గా డి.శ్రీనివాస్, జాయింట్ ట్రెజరర్‌గా ఎదపాటి వెంకటేశ్వరరావు విజయం సాధించారు.

ఇల్లెందులో..

ఇల్లెందు ఏరియా ప్రెసిడెంట్‌గా ఏ.శివప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లు చిన్నయ్య, మధుసూదన్, సెక్రటరీగా కె. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పవన్, ట్రెజరర్‌గా సందీప్ ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా ఎన్నికలు

కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి శాఖ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీఓఏ క్లబ్, సత్తుపల్లి జేవీఆర్‌ఓసీ ఆఫీసర్స్ క్లబ్‌లో 168 ఓట్లకుగాను 160 ఓట్లు పోలయ్యాయి. ఆర్‌సీఓఏ క్లబ్‌లో పోలింగ్ బూత్‌లో ఏరియా జనరల్ మేనేజర్ ఎం శాలేంరాజు, సీఎంఓఏఐ అధ్యక్షుడిగా బరిలో ఉన్న పీవీకే–5 ఇంక్లైన్ మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏరియా ఎస్ఓటు జీఎం కోటిరెడ్డి ఆధ్వర్యంలో సివిల్ ఏజీఎం రామకృష్ణ తదితరులు ఎన్నికల సిబ్బందిగా వ్యవహరించారు.

ఇల్లెందు: జీఎం కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయగా, 74 మంది ఓటర్లకుగాను 70 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జీఎం జాన్ ఆనంద్, ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య ఓటు వేసిన వారిలో ఉన్నారు. ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

క్లుప్తంగా

వచ్చే నెల 11, 12న కేవీపీఎస్ రాష్ట్ర సమావేశాలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న స్కైలాబ్‌బాబు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు తెలిపారు. ఆదివారం నగరంలోని మంచికంటిభవన్‌లో సంఘం రాష్ట్రస్థాయి సమావేశాల పోస్టర్లను ఆవిష్కరించాక స్కైలాబ్‌బాబు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను తొలగించేందుకు కుట్రలు చేస్తోందని తెలిపారు. మతోన్మాద బీజేపీని ఓడించేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, నాయకులు పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, కుక్కల సైదులు, ఐలపోగు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీలో స్థానం



పానిశెట్టి వెంకటేశ్వర్లు



చింతలచెరువు శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: పాల్వంచకు చెందిన ఇద్దరి నాయకులకు బీజేపీ జిల్లా కమిటీలో పదవులు లభించాయి. పాల్వంచకు చెందిన పానిశెట్టి వెంకటేశ్వర్లుకు రెండోసారి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా, చింతలచెరువు శ్రీనివాసరావుకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవులు వచ్చాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ ఆదివారం వారికి నియామకపత్రాలు అందజేశారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు

ఇల్లెందు: పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ కడకంచి పద్మ, ఆమె కుమారుడు కడకంచి వీరస్వామిపై అట్రాసిటీ కేసు నమోదైంది. కొత్త కాలనీలో నివాసముంటున్న పద్మ, వీరస్వామి ఈ నెల 4వ తేదీన ప్రజాపాలన కార్యక్రమం వద్ద అదే ఏరియాకు చెందిన బొల్లి రాజును దూషించి దాడి చేశారు. దీనిపై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేయాలని నిర్ణయించారు. అయితే, పద్మ, వీరస్వామి నుంచి సమాధానం రాకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం సీఐ టి.కరుణాకర్ వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా, గోవా క్యాంపునకు తరలివెళ్లిన వారిలో వార్డు కౌన్సిలర్ కడకంచి పద్మ కూడా ఉన్నారు. ఈ నెల 18న ఇల్లెందుకు చెందిన 13 మంది కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం సదాశివునిపేట, తుంబూరు గ్రామాల మధ్య కోడి పందేలు నిర్వహిస్తుండగా ఆదివారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.2 వేల నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ కుశకుమార్ తెలిపారు.

గుండాలపాడులో..

ములకలపల్లి: గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పలువురిని అరెస్ట్ చేశారు పోలీసుల కథనం మేరకు.. గుండాలపాడు గ్రామశివారులో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడులు నిర్వహించారు. 14 మందిని అరెస్ట్ చేశారు. రూ.5,400 నగదు, 10 కోడిపుంజులు, 7 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చాపరాలపల్లి శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ 1,500 నగదు, మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజమౌళి తెలిపారు.

మామపై అల్లుడు దాడి

ఇల్లెందు: పట్టణంలోని కలాసిబస్తీకి చెందిన కె.యాదగిరిరెడ్డిపై ఆయన అల్లుడు మధూకర్ రెడ్డి దాడి చేశారు. యాదగిరిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఓ ఫంక్షన్‌లో జరిగిన చిన్న ఘర్షణలో మామపై దాడి చేశాడు.

రొంపేడు సర్పంచ్‌పై దాడి

మండలంలోని రొంపేడు గ్రామ సర్పంచ్ అజ్మీర శంకర్‌పై అదే గ్రామానికి చెందిన గోప్యా దాడి చేశాడు. శంకర్ తండ్రి దేవ్లా ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంనకు చెందిన ఎ.కిరణ్‌కుమార్ (31) పురుగుల మందు తాగాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. కిరణ్‌కుమార్ రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులోని సమీపంలో కోళ్లఫారం వద్ద పురుగుల మందు తాగి మృతుడే కుటుంబసభ్యులకు, మిత్రులకు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు ఆరా తీసి ఘటనా స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

కూలి.. ఇకనైనా ఇవ్వాలి..

- ఇప్పటికీ అందని యూనిఫాం స్టిచ్చింగ్ చార్జీలు
- విద్యాసంవత్సరం ముగుస్తున్నా ఊసెత్తని అధికారులు
- కొత్త ప్రభుత్వంపైనే అందరి ఆశలు



ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ పాఠశాల విద్యార్థులు

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా సమానమేనన్న భావన తెచ్చేందుకు ప్రభుత్వం ఏటా ఏకరూప దుస్తులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. అయితే ప్రతి సంవత్సరం వస్త్రం అరకొరగా కేటాయిస్తుండటంతో సరిపడా దుస్తులు అందకపోయేవి. దీంతో సర్కారు బడుల్లో చదువుతున్న పేద పిల్లలు చిరిగిన దుస్తులతోనే పాఠశాలలకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో దుస్తుల కొరత ఇబ్బందులను అధిగమించేందుకు విద్యాశాఖ గతేడాది ముందస్తు చర్యలు తీసుకుంది. 2023 – 24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏకరూప దుస్తులను విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలలకు చేర్చింది. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు దుస్తులను కుట్టించి విద్యార్థులకు అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా దుస్తుల కుట్టు కూలీ మాత్రం నేటికీ మంజూరు కాలేదు. దీంతో దుస్తులు కుట్టిన వారు నానా అవస్థలు పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.

ప్రతీ ఒక్కరికి రెండు జతలు

రెక్కాడితేకాని డొక్కాడని పేదలు తమ పిల్లలకు దుస్తులు, పాఠ్యపుస్తకాల ఖర్చు తగ్గించుకునేందుకు అత్యధికులు సర్కారు పాఠశాలలకే తమ పిల్లలను పంపిస్తున్నారు. జిల్లాలోని 1,316 పాఠశాలలకు చెందిన 72,458 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 35,732 మంది బాలురు, 36,246 మంది బాలికలు ఉన్నారు. ఇదిలాఉండగా పాఠశాలల్లో విద్యార్థులకు ఏటా రెండు జతల ఏకరూప దుస్తులను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. గతంలో ఎదురైన లోపాలను సరిచేస్తూ పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 2023 – 24 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అప్పటి ప్రభుత్వం ఏకరూప దుస్తులను సరఫరా చేసింది.

ఏజెన్సీలకు కుట్టే బాధ్యత..

ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను కుట్టే బాధ్యతను ఏజెన్సీలకు అప్పగించడం అనేక ఏళ్లుగా కొనసాగుతోంది. అయితే ప్రభుత్వం స్టిచ్చింగ్ చార్జి కింద జతకు రూ.50 చొప్పున రెండు జతలకు రూ.100 మాత్రమే చెల్లిస్తోంది. గతేడాది నుంచి దుస్తుల స్టిచ్చింగ్ విషయంలో అదనపు హంగులను ఉన్నతాధికారులు నిర్దేశించడంతో దర్జీలు సహజంగానే అదనంగా చెల్లించాలని పట్టుపట్టారు. ఒక్కో జతకు రూ.100 చొప్పున చెల్లించేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో దర్జీలు ఒప్పందం చేసుకొని పని ప్రారంభించారు. అదనపు భారాన్ని కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, మరికొన్ని చోట్ల విద్యార్థులు భరించక తప్పలేదు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో స్వయంగా ప్రధానోపాధ్యాయులే అదనపు చార్జిలను చెల్లించగా.. అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో నేరుగా విద్యార్థులే అదనపు చార్జిలు చెల్లించాల్సి వచ్చింది.

నేటికీ అందని కూలి

పాఠశాలలు ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తోంది. ఇంకా మహా అంటే రెండు నెలలకు మించి పాఠశాలలు కొనసాగవు. కానీ దుస్తులతో పాటుగా విద్యాసంవత్సరం ప్రారంభంలోనే కుట్టు కూలీ చెల్లించాల్సిన ప్రభుత్వం నేటికీ ఆ ఊసే ఎత్తడం లేదు. క్షేత్రస్థాయిలో ప్రధానోపాధ్యాయులు సైతం ఉన్నతాధికారులను అడగలేకపోవడంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మొత్తంగా ఒక్కో విద్యార్థికి రూ.100 చొప్పున జిల్లాలోని 72,458 మంది విద్యార్థులకు ప్రభుత్వం రూ.72,45,800 చెల్లించాల్సి ఉంది. అయితే కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులే స్టిచ్చింగ్ చార్జి మొత్తాన్ని దర్జీలకు చెల్లించగా కొన్ని పాఠశాలల్లో మాత్రం నేటికీ కుట్టు కూలీ కోసం దర్జీలు పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా కొత్త ప్రభుత్వమైనా పాఠశాలలకు చెల్లించాల్సిన స్టిచ్చింగ్ చార్జిలను వెంటనే చెల్లించాలని ముందస్తుగా చెల్లించిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, నేటికీ పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దర్జీలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

2023 – 24 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు సరఫరా చేసిన ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్ చార్జిలు నేటికీ మంజూరు కాలేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు కలిపి రూ.72,45,800 చెల్లించాల్సి ఉంది. దీనికోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి నివేదించాం. మంజూరు కాగానే పాఠశాలల ఖాతాల్లో జమచేస్తాం.

–వెంకటేశ్వరాచారి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం

అవిశ్వాసం వైపు అడుగులు..

- మున్సిపల్, సొసైటీ ఛైర్మన్ల పదవులకు గండం..
- వ్యూహ రచన చేస్తున్న అధికార పార్టీ



సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మన్, సొసైటీ ఛైర్మన్ పదవులపై అవిశ్వాసం పెట్టేందుకు అడుగులు పడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. అధికార పార్టీ వ్యూహరచనతో ఒక్కసారిగా సత్తుపల్లి రాజకీయం వేడెక్కింది. సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మన్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తయింది. ఏడాది సమయం ఉన్నందున పాలకవర్గాన్ని అధికారపార్టీ ఆధీనంలోని తీసుకునేందుకు తెరవెనుక రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలు సిద్ధమవుతున్నాయని సమాచారం. అవిశ్వాస తీర్మానం అటుంచితే.. మున్సిపల్ ఛైర్మన్ పదవికి ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో అంతర్గతంగా చర్చోపచర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. తెరపైకి వైస్ ఛైర్మన్ తోట సుజలారాణి, దూదిపాల రాంబాబు పేర్లు వినిపిస్తున్నాయి. ఇకపోతే సత్తుపల్లి సొసైటీ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తయినట్లు సమాచారం.

అప్పుడు అంతా బీఆర్ఎస్‌మయం

సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో 23 స్థానాలకు గాను 23 స్థానాలు బీఆర్ఎస్ చేజిక్కించుకుంది. వీటిలో ఐదు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అప్పట్లో తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, డాక్టర్ మట్టా దయానంద్, ముజ్జా విజయబాబు అందరూ బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. దీంతో మున్సిపల్ పాలకవర్గం అంతా వన్‌సైడ్‌గా ఎన్నికైంది. కాంగ్రెస్ పార్టీ నామమాత్రపు ఓట్లతోనే సరిపుచ్చుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా కూసంపూడి మహేశ్, వైస్ ఛైర్మన్‌గా తోట సుజలారాణిని ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ టచ్‌లోకి కౌన్సిలర్లు..

మారిన రాజకీయ పరిణామాలతో సండ్ర వెంకటవీరయ్య మినహా మిగిలిన నేతలందరూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతే కాకుండా రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్ చేజిక్కించుకుంది. ఎన్నికల సమయంలో వైస్ ఛైర్మన్‌తో పాటు నలుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇంకా ఏడుగురు కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే మున్సిపల్ ఛైర్మన్ పదవిపై అవిశ్వాసం నెగ్గుతుంది. ఇప్పటికే కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ పార్టీకి టచ్‌లోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ సంఖ్య ఎంత వరకు ఉందో అవిశ్వాసం తీర్మానం పెడితేనే బయటపడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సొసైటీ ఛైర్మన్ పదవికీ..

సత్తుపల్లి సొసైటీ ఛైర్మన్ చల్లగుండ్ల కృష్ణయ్య పదవికి గండం పొంచి ఉంది. కాంగ్రెస్–2, బీజేపీ–2, టీడీపీ–2 సీపీఎం–1, బీఆర్ఎస్–6 డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాటిలో బీజేపీ నుంచి ఒకరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కాంగ్రెస్‌లో చేరారు. టీడీపీకి చెందిన ఇద్దరు డైరెక్టర్లు కాంగ్రెస్‌కే మద్దతుగా ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. దీంతో కాంగ్రెస్ బలం 7కు చేరింది. మరికొందరు డైరెక్టర్లు కాంగ్రెస్‌పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఛైర్మన్ పదవిపై చల్లగుండ్ల కృష్ణయ్య, చల్లగుళ్ల నర్సింహారావు పోటీ పడ్డారు. అప్పట్లో జరిగిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన గాదె చెన్నారావు చల్లగుండ్ల కృష్ణయ్యకు ఇద్దరు సభ్యులతో మద్దతు ఇవ్వటంతో ఆయన ఎన్నికయ్యారు. గాదె చెన్నారావు వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మారిన రాజకీయ పరిణామాలతో సత్తుపల్లి సొసైటీని అవిశ్వాసం పెట్టి వైస్‌ఛైర్మన్‌గా ఉన్న గాదె చెన్నారావును ఛైర్మన్‌గా చేయాలని అధికార పార్టీ వ్యూహరచన చేస్తున్న ట్లు తెలిసింది. ఇప్పటికే సంబంధిత డైరెక్టర్లు ఒక అంగీకారానికి వచ్చినట్లు రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతోంది.

సెల్ టవర్ ఎక్కిన యువకుడు



సెల్ టవర్‌పై ఉన్న యువకుడు

ముదిగొండ: కేసు లేకుండా చేస్తానని ఓ వ్యక్తి డబ్బులు తీసుకుని తనకు న్యాయం చేయలేదని ఓ యువకుడు ఆదివారం సెల్ టవర్ ఎక్కిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని గోకినేపల్లి గ్రామానికి చెందిన పయ్యావుల వినోద్ భార్య ఏడాది కిందట తన ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి వినోద్ కారణమని ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మీగడ శ్రీనివాస్‌యాదవ్ గ్రామంలోని కొందరు కలిసి కేసు తేలే వరకు ఇద్దరు పెద్ద మనుషుల వద్ద కొంత డబ్బు ఉంచాలని నిర్ణయించారు. కేసు తీయించాలంటే ఖర్చవుతుందని మీగడ శ్రీనివాస్.. వినోద్ వద్ద రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. ఇద్దరి వద్ద ఉంచాల్సిన డబ్బులు కూడా ఎవరికీ తెలియకుండా వినోద్ భార్య తాతయ్య పేరున ఓ బ్యాంక్‌లో డిపాజిట్ చేయించాడు. కేసు గురించి కొన్నాళ్లుగా వినోద్ మీగడ శ్రీనివాస్‌ను అడుగుతుంటే సరైన సమాధానం చెప్పటం లేదు. తన కుమారుడికి చెందాల్సిన డబ్బులు ఎవరి పేరునో ఎందుకు డిపాజిట్ చేశావని అడిగితే తనని బెదిరిస్తున్నాడని, ఎవరి వద్దకు వెళ్లినా న్యాయం జరగటం లేదని ఆదివారం సెల్‌టవర్ ఎక్కాడు. విషయం తెలిసిన గ్రామస్తులు ఆందోళన చెపట్టారు. కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వినోద్‌తో మాట్లాడటంతో సెల్‌టవర్ పైనుంచి కిందకు దిగాడు. వివరాలు అడిగి తెలుసుకుని న్యాయం చేస్తామని చెప్పటంతో పరిస్థితి సద్దుమణిగింది. పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ ఈ సందర్భంగా తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

దమ్మపేట: భార్యను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న భర్త, అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన గణప రామకృష్ణకు నాలుగేళ్ల కిందట లచ్చాపురం గ్రామానికి చెందిన సౌజన్యతో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.15 లక్షలు కట్నంతో పాటుగా బంగారు ఆభరణాలు కూడా ఇచ్చారు. కాగా, గతేడాది ఆగస్టు 9వ తేదీన సౌజన్యను ఆమె భర్తతో పాటు కుటుంబ సభ్యులు గణప రాధ, వెంకటేశ్వరరావు, వీరస్వామి, తొగర్త శ్రావణి అదనపు కట్నం తేవాలని డిమాండ్ చేస్తూ మానసికంగా, శారీరకంగా వేధించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

మరో కేసులో..

భద్రాచలంటౌన్: భార్యను వేధిస్తున్న భర్తపై స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని శిల్పినగర్‌కాలనీకి చెందిన లక్ష్మి, భవానిశంకర్‌లు ఏడాది కిందట వివాహం చేసుకున్నారు. భవానీశంకర్ ప్రస్తుతం భార్యను వేధించడం ప్రారంభించాడు. విసుగుచెందిన లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాల్వంచ రూరల్‌లో...

పాల్వంచరూరల్: మద్యం మత్తులో భార్యను నిత్యం వేధిస్తున్న భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఉల్వనూరు కొత్తూరు గ్రామానికి చెందిన ఊకే కుమారిని ఆమె భర్త శ్రీను రోజూ మద్యం సేవించి వచ్చి వేధిస్తున్నాడు. దీంతో కుమారి తల్లి ఇంటికి వెళ్లగా అక్కడికి కూడా వచ్చి కొడుతున్నాడు. కుమారి ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

ఇద్దరిపై కేసు..

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామంలో షేక్ సుభానీ ఇంటి ప్రహరీకి సంబంధించిన గేటు దిమ్మెలు, గేటును గ్రామానికి చెందిన ఎస్.నాగేశ్వరరావు, రామలింగయ్య ధ్వంసం చేశారు. ఈ ఘటనపై సుభానీ ఫిర్యాదు మేరకు ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రామారావు తెలిపారు.

చోరీపై..

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామంలోని శ్రీవెంకటేశ్వర టౌన్‌షిప్‌లో రల్లా రవికిశోర్‌రెడ్డి ఇంట్లో ఈ నెల 25న చోరీ జరగగా పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. రవికిశోర్‌రెడ్డి ఈ నెల 20న ఆస్పత్రి పనినిమిత్తం తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువా తాళం పగులగొట్టి సుమారు రూ.90 వేల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒకేసారి మూడు ఇళ్లల్లో చోరీ

మత్తు మందు ప్రయోగించినట్లు అనుమానాలు



దుండగులు చోరీకి పాల్పడిన ఇల్లు

ఖమ్మంక్రైం: నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలోని మూడు ఇళ్లల్లో ఒకేసారి చోరీకి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించింది. మత్తు మందు ప్రయోగించి ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కవిరాజ్‌నగర్‌లో వ్యాపారి మిర్యాల రంగయ్య, ఉమ దంపతులు నివాసం ఉంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వారి ఇంట్లోకి వెనుక నుంచి చొరపడ్డారు. 17 తులాల బంగారం, రూ.67 వేలు చోరీచేశారు. అక్కడి నుంచి బయటకు వచ్చి ఎదురుగా ఉన్న సత్యనారాయణ ఇంట్లోకి వెళ్లి రూ.6 వేలు, ముళ్లపూడి సురేశ్ ఇంట్లోని రూ.వెయ్యి చోరీ చేశారు. కాగా, మిర్యాల రంగయ్య ఇంట్లో పెంపుడు కుక్క ఉంది. అయితే, దానికి మత్తు మందు ఇచ్చి దుండగులు ఇంట్లోకి చొరబడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఇంట్లో మనుషులు ఉండగానే దొంగలు చోరీకి పాల్పడటంతో వారిపైన కూడా మత్తు మందు ప్రయోగించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలాన్ని టూటౌన్ సీఐ కుమారస్వామి, క్లూస్ టీమ్, సీసీఎస్ సిబ్బంది సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన మట్టి ట్రాక్టర్లు

దమ్మపేట: అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని డయల్ 100కు ఫిర్యాదు అందింది. దీంతో స్పందించిన పోలీసులు దమ్మపేట ప్రధాన రహదారిపై మట్టి లోడుతో వెళ్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ మట్టిని దమ్మపేటలోని ఓ ఇంటి నిర్మాణానికి తరలిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఎస్ఐ సాయికిశోర్ రెడ్డిని వివరణ కోరగా.. నాలుగు ట్రాక్టర్లను స్టేషన్‌లోనే ఉంచామని, దీనిపై నివేదిక తయారు చేసి తహసీల్దార్‌కు అందజేస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్...

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని చాపరాలపల్లి శివారు పాములేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడులు నిర్వహించి, ట్రాక్టర్‌ను అదుపులోని తీసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆలయ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయ ఉద్యోగిని ఈఓ రమాదేవి ఆదివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయంలోని స్టోర్స్‌లో నిత్యావసర విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఎల్డీసీ శ్రీకాంత్ స్టోర్ నిర్వహణలో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో ఈఓ సస్పెండ్ చేశారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్దఎత్తున ఆదివాసీలు తరలివచ్చారు. వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, రైస్‌పేట, పెదమిడిసిలేరు క్రాస్‌రోడ్డు, కుర్నపల్లిరోడ్డుల్లో మోహరించిన పోలీసులు వచ్చి పోయే వారిని నిశితంగా పరిశీలించారు. అనుమానితులుగా భావిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని, విచారించి, వదిలిపెట్టారు. ఎస్ఐలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీల్లో పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

దమ్మపేట: అతివేగంతో వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. మండలంలోని నాగుపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన సవలం రాము (18), తుర్సం ఏసుబాబుతో కలిసి తన ద్విచక్రవాహనంపై పనిమీద నాగుపల్లి వెళ్లి, తిరిగి శనివారం రాత్రి సమయంలో బుగ్గపాడుకు వస్తున్నాడు. ఈ క్రమంలో నిర్లక్ష్యం, అతివేగంతో వస్తున్న లారీ, సవలం రాము బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడగా గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా సవలం రాము అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత...



ప్రమీల (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. మండలంలోని బచ్చువారిగూడెం గ్రామానికి చెందిన తెల్లం ప్రమీల(23), ఇదే గ్రామానికి చెందిన హరిబాబు ప్రేమించుకుని మూడేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. వీరికి 17 నెలల బాబు ఉన్నాడు. కాగా, శనివారం అర్ధరాత్రి ప్రమీల ఇంట్లోనే ఉరివేసుకొని శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి కాక విజయ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. తన కుమార్తె మృతిపై తండ్రి అనుమానం ఉన్నట్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

హిందుత్వను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మోదీ సక్సెస్

- డిజిటల్, సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకున్నారు
- దేశభక్తి వేరు, జాతీయత వేరు
- పుస్తకాలు బాగా చదివితేనే ఉత్తమ రచనలు చేయవచ్చు
- హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో అజయ్ గాంధీ స్మారక ప్రసంగం చేసిన శశిథరూర్



కార్యక్రమంలో శశిథరూర్, సునీతారెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 'హిందుత్వ'ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ విజయవంతమయ్యారని పార్లమెంట్ సభ్యుడు, ప్రముఖ రచయిత శశిథరూర్ అన్నారు. సామాజిక మాధ్యమాలను, డిజిటల్ సాంకేతిక వ్యవస్థలను ఆయన సమర్థవంతంగా వినియోగించుకున్నారని చెప్పారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హైటెక్‌సిటీ సత్వ నాలెడ్జ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్, దివంగత అజయ్ గాంధీ స్మారకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎల్‌ఎఫ్ వ్యాఖ్యాత సునీతారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. శశిథరూర్ మాట్లాడుతూ, 2018లో తాను రాసిన 'ది పారాడాక్సికల్ ప్రైమ్ మినిస్టర్'గ్రంథానికి పెద్దగా ఆదరణ లభించలేదని, కానీ ప్రధాని మోదీ పదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఆ పుస్తకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని పేర్కొన్నారు. సాంకేతిక వ్యవస్థలను వినియోగించుకోవడం ద్వారా హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో మోదీ ఆలోచనా విధానాన్ని మాత్రమే తాను ప్రస్తావిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాతీయత, దేశభక్తి భావాల పట్ల మీ అభిప్రాయం ఏమిటి? అని సునీతారెడ్డి ప్రశ్నించగా, అవి రెండూ వేర్వేరని చెప్పారు. దేశభక్తి అంటే తల్లి పట్ల బిడ్డలకు ఉండే భావోద్వేగభరితమైన ప్రేమ వంటిదని, దేశభక్తులు తమ దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించేందుకు సిద్ధంగా ఉంటారని చెప్పారు. కానీ జాతీయత రాజకీయ నిర్మాణంలో భాగమని పేర్కొన్నారు. జాతీయతావాదం కంటే దేశభక్తే గొప్పదన్నారు. దేశానికి కావలసింది దేశభక్తులని చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్యసంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రాముఖ్యతను కోల్పోయాయని ఇటీవల శ్యామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపైన ఆయన స్పందించారు. అంతర్జాతీయ సంస్థల ఏర్పాటులోనే చాలా ఆలస్యం జరిగిందని అన్నారు. ఇప్పుడు వాటిని పక్కన పెట్టడం ముఖ్యం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలను కాపాడుకోవాలని, వాటిని మరింత బలోపేతం చేసుకోవలసిన అవసరముందని చెప్పారు. ఇందుకోసం భారత్ ప్రధాన బాధ్యత తీసుకోవాలని సూచించారు.

విస్తృత అధ్యయనం వల్లనే ఉత్తమ రచనలు

అన్ని రకాల పుస్తకాలను విస్తృతంగా, లోతుగా అధ్యయనం చేసినప్పుడే ఉత్తమ రచనలు చేయడం సాధ్యమవుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా శశిథరూర్ చెప్పారు. పుస్తకాల అధ్యయనంలోనూ వైవిధ్యం ఉండాలని సూచించారు. అలాగే పదసంపదను కూడా బాగా పెంచుకోవాలని, అప్పుడు మాత్రమే స్పష్టంగా రాయలగుతారని పేర్కొన్నారు. తాను రాసిన 'ఎ వరల్డ్ ఇన్ 100 ఎస్సేస్'పుస్తకం త్వరలో వెలువడనుందని చెప్పారు. ఈ పుస్తకాన్ని చదవడం వల్ల పదజాలాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎల్‌ఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. మరో సెషన్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను కాంగ్రెస్ పార్టీలాగానే ఉంచాలని, మరే ఇతర పార్టీల మాదిరిగా మార్చరాదని పేర్కొన్నారు.

రూ. 5 లక్షలిస్తే 'విద్యానిధి' మీదే!

▶ మొదటి పేజీ తరువాయి

మోసం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

అత్యంత గోప్యంగా ఎంపిక ప్రక్రియ

పరిమిత కోటాతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు ఏటా గరిష్టంగా 2 వందల మందికి, బీసీ, ఈబీసీలకు 300 మందికి సాయం అందిస్తోంది. బీసీ, ఈబీసీ కేటగిరీలో ఈ ఏడాది ఏకంగా 3వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పోటీ తీవ్రంగా ఉండటంతో దరఖాస్తు, సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో మధ్యవర్తులు తల్లిదండ్రులను బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అడుగుతూ ఈ పథకం కింద తప్పకుండా మీకు ఆర్థిక సాయం అందేలా చూస్తామని నమ్మబలుకుతున్నారు. విద్యానిధి పథకం కింద దరఖాస్తులు, సర్టిఫికెట్ల పరిశీలన, అర్హుల ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ ఉంటుంది. సంబంధిత సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి/కార్యదర్శితో పాటు సంక్షేమ శాఖ కమిషనర్/డైరెక్టర్, అదనపు సంచాలకులు, సంయుక్త సంచాలకులు, ఉప సంచాలకులు ఇందులో ఉంటారు. ఈ ప్రక్రియ ఆద్యంతం గోప్యంగా సాగుతుంది. ఎంపికైన తర్వాత జాబితా వెలువడినప్పుడు మాత్రమే అర్హుల పేర్లు బయటకు వస్తాయి. ఈ అంశాన్ని మధ్యవర్తులు అవకాశంగా మలుచుకుంటున్నారు. కొందరు జాబితా వెలువడిన వెంటనే లబ్ధిదారులకు ఫోన్లు చేసి తమ ప్రయత్నం వల్లే ఆర్థిక సాయం అందుతోందంటూ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి వసూళ్లకు తెగబడుతున్నారు.

అధికార యంత్రాంగం నజర్

వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థి తండ్రి ఇటీవల ఫిర్యాదు చేయడంతో విద్యానిధి పథకంలో జరుగుతున్న అక్రమ వ్యవహారంపై అధికారులు దృష్టి పెట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులను పిలిపించి మధ్యవర్తుల అంశంపై ఆరా తీస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. దీనిపై ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యానిధి అర్హతలు, ఎంపిక ఇలా...

విదేశీ విద్యా నిధి పథకంలో గ్రాడ్యుయేషన్ మార్కులు కీలకం. నిర్దేశించిన దేశాల్లో ఎంఎస్ చదువుకునే విద్యార్థులు ఈ పథకం కింద ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించాలి. విద్యార్థి డిగ్రీ మార్కులకు 60 శాతం స్కోర్, జీఆర్‌ఈ/జీమ్యాట్ స్కోర్‌కు 20 శాతం, ఐఈఎల్‌టీఎస్/టోఫెల్‌కు మరో 20 శాతం మార్కులుంటాయి. దరఖాస్తులను అధికారులు వడపోసి నిబంధనల ప్రకారం అత్యధిక మార్కులున్న వారిని రిజర్వేషన్ల వారీగా ఎంపిక చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో అత్యధిక మార్కులున్న వారి జాబితాను రూపొందించి పరిమితికి లోబడి అర్హుల ఎంపిక చేపడతారు. బీసీల్లో మాత్రం సబ్ కేటగిరీలు, ఈబీసీ కేటగిరీ వారీగా వడపోత చేపట్టి ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థికి మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయ్యాక సగం, చివరి రెండు సెమిస్టర్లు పూర్తయ్యాక మిగతా సాయాన్ని ప్రభుత్వం విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. విద్యార్థి చదువుకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తేనే నిధులు విడుదలవుతాయి.

బాబు ప్రసంగానికి కుర్చీలే అతిథులు!

- నెల్లూరు, పత్తికొండలో 'రా.. కదలిరా' సభలు అట్టర్ ఫ్లాప్
- లక్ష మంది హాజరవుతారని టీడీపీ నాయకుల అంచనా
- నిండా ఏడెనిమిది వేల మంది కూడా హాజరు కాని పరిస్థితి
- సభ ఆలస్యం.. బాబు మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన ప్రజలు

నెల్లూరులో నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలోనే జనం లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



కర్నూలు(సెంట్రల్)/నెల్లూరు, సాక్షి ప్రతినిధి/నెల్లూరు సిటీ : నెల్లూరు నగరంలో, కర్నూలు జిల్లా పత్తికొండలో టీడీపీ ఆదివారం నిర్వహించిన 'రా.. కదలి రా' సభలు జనం లేక వెలవెలబోయాయి. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఖాళీ కుర్చీలను చూస్తూ ప్రసంగించాల్సి వచ్చింది. ఒక్కో సభకు లక్ష మంది చొప్పున రప్పించాలనుకున్న వారి వ్యూహం బెడిసికొట్టింది. కనీసం ఏడెనిమిది వేల మంది చొప్పున కూడా జనం హాజరు కాలేదు. వచ్చిన వారు కూడా బాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయారు. దీంతో స్థానిక నేతలపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. నెల్లూరు, పత్తికొండలో భారీ జన సమీకరణకు ఆ పార్టీ నేతలు యత్నించినా ఫలితం లేకపోయింది. చాలాచోట్ల డబ్బులిస్తామన్నా.. 'మేము రాము బాబో.. మీ సభలకు' అంటూ ప్రజలు ముఖంమీదే తేల్చి చెప్పడంతో స్థానిక టీడీపీ నేతలు చేతులెత్తేశారు. రెండు జిల్లాల్లోనూ సభలు జనం లేక వెలవెలబోవడంతో పార్టీ అధిష్టానంతోపాటు క్యాడర్ నైరాశ్యంలోకి వెళ్లిపోయింది.

డబ్బులు, మద్యం ఎర చూపినా..

నెల్లూరులో డబ్బులు, మద్యం ఎర చూపినా ప్రజలు చంద్రబాబు సభ వైపు రాలేదు. కేవలం రెండు వేల మంది మాత్రం ఎస్వీజీఎస్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో హడావుడి చేశారు. వారూ వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్ద నాయకులకు టెంట్, కూలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో మండుటెండలో వారు విలవిలలాడారు. ఉదయం 11.30 గంటలకు రావాల్సిన చంద్రబాబు మధ్యాహ్నం 12.45 గంటలకు ఆసల్యంగా సభా ప్రాంగణానికి చేరుకోవడం కార్యకర్తల సహనానికి పరీక్ష పెట్టింది. సభకు వచ్చిన కార్యకర్తలకు రూ.250, క్వార్టర్ మద్యం బాటిల్ పంపిణీ చేయడం కనిపించింది. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఆద్యంతం కుర్చీలు ఖాళీగా కనిపించడంతో స్థానిక నాయకులపై బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

తాను మాట్లాడే సమయానికి ప్రజలను నిలబెట్టలేకపోయారా అని నెల్లూరు నగర రూరల్ ఇన్‌చార్జిపై మండిపడ్డారు. పత్తికొండలోని ఆదోని రోడ్డులో జరిగిన సభకు కచ్చితంగా లక్ష మంది వస్తారని శనివారం సాయంత్రం స్థానిక నేతలు చంద్రబాబుకు సమాచారం ఇచ్చారు. తీరా ఆదివారం ప్రజలెవరూ రాకపోవడంతో సభాస్థలిలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కాగా, పత్తికొండ, నెల్లూరులో సభల్లో చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'ఆయన అభిమన్యుడు కాదు.. అర్జునుడూ కాదూ.. భస్మాసురుడు' అని విమర్శించారు.

పేదరికంపై గెలుపు

- ఏపీలో మెరుగుపడ్డ జీవన ప్రమాణాలు
- పేదల ఆదాయాలు పెరగటంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం
- పౌష్టికాహారం, గృహవసతి, తాగునీరు... అన్నింటా మెరుగుదల
- జీవన నాణ్యత పెరిగి.. పేదరికం తగ్గిందని తేల్చిన నీతి ఆయోగ్
- 2019–21లో 6.06 శాతం... 2022–23 నాటికి 4.19 శాతానికి
- రాష్ట్రంలో నాలుగేళ్ల కాలంలో 1.87 శాతం తగ్గిన పేదరికం
- ఇదే కాలంలో దేశ సగటు 14.96 శాతం నుంచి 11.28 శాతానికి తగ్గుదల
- నవరత్నాలతో వేగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన
- డీబీటీ, నాన్ డీబీటీతో ఇప్పటి వరకు రూ.4.21 లక్షల కోట్లు పేదలకు
- భారత దేశంలో, రాష్ట్రంలో పేదరికంపై నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పాపం తెలుగు దేశం పార్టీ

- గెలుపునకు కనీసం దరిదాపుల్లో కూడా బాబు లేడు
- ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులో నిర్వహించిన 'రా కదలిరా' చంద్రబాబు సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని, జనాలు లేక ఖాళీ కుర్చీలకు బాబు ప్రసంగం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ సమర శంఖారావం సభ ఈ ప్రాంతంలోనే నిర్వహించామని, అప్పుడు వేల మంది జనాలు వచ్చారని గుర్తు చేశారు. కానీ 'రా కదలిరా' అంటూ చంద్రబాబు పిలుపునిచ్చినా కుర్చీలు కూడా నిండలేదన్నారు. 4 వేల కుర్చీల కన్నా తక్కువ వేసి, కనీసం 3 వేల మందిని కూడా తీసుకురాలేని పరిస్థితిలో తెలుగుదేశం నాయకులు ఉన్నా రని పేర్కొన్నారు. చంద్రబాబుకు డబ్బాలు కొట్టే సొంత మీడియా కూడా ముందు ఉన్న వంద మందిని తప్ప సభను చూపించలేకపోయిందంటే పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఏ విధంగా గెలిచామో.. 2024 ఎన్నికల్లో కూడా అదే సీన్ రిపీట్ అవుతుందని జోస్యం చెప్పారు. జిల్లాలో టీడీపీ గెలుపునకు దరిదాపుల్లో కూడా లేదన్నారు. చంద్రబాబు ప్రసంగం మొత్తం ఊకదంపుడు తప్ప, ఆయన హయాంలో ఏం చేశారో కనీసం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

జిల్లా వార్తలు

'నివేదన' ఎప్పుడో..?

- ఎనిమిది నెలలుగా 'కొత్త' ఆలయాలకు మంజూరు కాని డీడీఎన్ నిధులు
- వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న అర్చకులు
- నిత్య నైవేద్యానికి సైతం దాతలపైనే ఆధారం
- కరువవుతున్న కమిటీల సహకారం


చుంచుపల్లి తండాలోని అభయాంజనేయస్వామి ఆలయం

ఖమ్మంగాంధీచౌక్: ధూప దీప నివేదన పథకాన్ని(డీడీఎన్) పలు ఆలయాలకు మంజూరు చేసినా.. అటు అర్చకులకు, ఇటు ఆలయాల నిర్వహణకు నిధులు విడుదల చేయడం లేదు. గతేడాది తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ధూప దీప నివేదన పథకం కింద మూడో విడతగా పలు కొత్త ఆలయాలను ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోనూ నూతన అర్చకుల నియామకాలు జరిగాయి. అయితే, వారికి నియామక పత్రాలు ఇచ్చినా నేటికీ వేతనాలు మాత్రం రాలేదు. ధూప దీప నివేదన పథకం కింద అర్చకులను నియమించడంతో పలు ఆలయ కమిటీలు నిర్వహణ బాధ్యతలను పూర్తిగా ఆయా అర్చకులకే అప్పగించారు. పథకం కింద నిధులు మంజూరు కాకపోవటంతో వేతనాల మాట అలా ఉంచితే భగవంతునికి దీపం, ధూపం, నైవేద్యానికి సైతం అర్చకులే సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

8 నెలలుగా ఎదురుచూపులే..

ధూప, దీప నివేదన పథకం కింద నూతనంగా ఎంపికైన దేవాలయాలకు, అర్చకులకు నిధులు మంజూరు కాలేదు. మూడో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా పథకాన్ని అమలు చేయడంతో అర్చకుల్లో ఆనందం వ్యక్తమైనప్పటికీ.. నెల తరబడి నిధులు రాకపోవడం అర్చకులను ఇబ్బందులకు గురి చేస్తోంది. మూడో విడతగా 2023 జూన్‌లో ఖమ్మం జిల్లాలో 67, భద్రాద్రి జిల్లాలో 35 దేవాలయాలకు డీడీఎన్ పథకాన్ని మంజూరు చేసి ఒక్కో దేవాలయానికి ఒక్కో అర్చకుడిని నియమించారు. ఆ సమయంలో ఖమ్మం జిల్లాలో నిలిపివేసిన మరో 41 మందికి కూడా గణతంత్ర వేడుకల సందర్భంగా జనవరి 26న నియామక పత్రాలు అందజేశారు. మొత్తంగా మూడో విడతలో ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో 143 దేవాలయాలను ధూప దీప నివేదన పథకంలో చేర్చారు. ఈ మొత్తంలో 102 దేవాలయాలకు 8 నెలలుగా నిధులు మంజూరు కాలేదు.

కరువవుతున్న కమిటీల సహకారం

దేవాలయాలను ధూప దీప నివేదన పథకంలో చేర్చి అర్చకులను నియమించడంతో ఆలయ కమిటీల నుంచి సహకారం కొరవడుతోంది. నివేదన పథకం నుంచి వచ్చే నిధులతో ఆలయాలు నిర్వహించాలంటూ కమిటీ సభ్యులు పట్టించుకోకపోవడంతో ఆలయ నిర్వహణ భారం అర్చకులపైనే పడుతోంది. నిధులు సకాలంలో మంజూరైతే తమకు ఏ ఇబ్బందీ ఉండదని అర్చకులు అంటున్నారు.


రూ. 2,500 నుంచి రూ.10 వేలకు పెంపు

పురాతన ఆలయాలు, కాకతీయ కాలం నాటి ఆలయాలకు ప్రాముఖ్యతను పెంచేలా ఆయా ఆలయాల్లో నిత్యం దీపం వెలిగించడం, భగవంతుడికి నైవేద్యం పెట్టడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆయా దేవాలయాలను రక్షించటం, అర్చకులకు ఉపాధి కల్పించటం కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 2007లో ధూప దీప నివేదన పథకాన్ని రూపొందించారు. నాడు అర్చకుడికి గౌరవ వేతనం నెలకు రూ. 1500, ధూప దీప నివేదన ఖర్చులు(పడితరం) రూ.1000గా నిర్ణయించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2018లో అర్చకుడి గౌరవ వేతనం రూ. 4,000, పడితరం రూ. 2,000కు పెంచారు. పెరిగిన ఖర్చులకు ఈ నిధులు, వేతనాలు సరిపోవని భావించిన అప్పటి ప్రభుత్వం.. గతేడాది సెప్టెంబర్ నుంచి అర్చకుల వేతనాలను రూ. 6,000, పడితరం రూ.4,000.. మొత్తం రూ.10వేలకు పెంచింది. అయితే నూతనంగా నియమించిన అర్చకులకు మాత్రం ఆ నిధులు అందడం లేదు.

అవస్థలు పడుతున్న అర్చకులు

ధూప దీప నివేదన పథకం నిధులు మంజూరు కాకపోవడంతో అర్చకులు అవస్థలు పడుతున్నారు. దేవాలయాన్నే నమ్ముకుని ఓ వైపు దేవుడి కార్యక్రమాలను నిత్యం నిర్వహించడం, మరో వైపు కుటుంబాన్ని పోషించటం వారికి భారంగా మారుతోంది. దేవాలయంలో నిత్యం దీపారాధనతో పాటు నైవేద్యం పెట్టాలి. ఈ కార్యక్రమాలు ఖర్చుతో కూడుకున్నవి. దీంతో ప్రస్తుతం అర్చకులు తమ జేబులో నుంచే పెట్టాల్సి వస్తోంది. ఇక కుటుంబ పోషణ, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు వంటి ఖర్చులకు అర్చకులు ఇబ్బందులు పడుతున్నారు. కేటాయించిన దేవాలయాలతో పాటు గ్రామాల్లో, సమయం దొరికినప్పుడు బయట కార్యక్రమాలను నిర్వహించుకుంటూ నెట్టుకొస్తున్నారు.


నిధులు అందక ఇబ్బంది పడుతున్నాం..



నివేదన పథకంలో ఎంపిక వడం, ఇదే క్రమంలో గత ప్రభుత్వం నెలకు రూ. 10 వేలుగా ప్రకటించటం ఆనందాన్నిచ్చింది. అయితే నియామక పత్రం అందుకుని 8 నెలలు గడుస్తున్నా ఒక్క నెల వేతనం కూడా అందలేదు. వేతనాల కోసం నెలల తరబడి అందక పోవటంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది.

– కౌశిక్ అమరేశ్వర శర్మ, లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం, గుదిమళ్ల, ఖమ్మం రూరల్ మండలం

ఆలయాల నిర్వహణ కూడా భారమవుతోంది



ధూప దీప నివేదన పథకంలో చేరినప్పటి నుంచి నిధులు మంజూరు కాలేదు. ఆలయాల నిర్వహణ కూడా భారంగా మారుతోంది. నిత్యం దేవాలయాల్లో దీపం వెలిగించి దేవునికి నైవేద్యం పెట్టాలి. ఇందుకోసం నిత్యం ఖర్చు తప్పదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– కలషాపూడి అంజనికుమార్ శర్మ, ఆంజనేయ స్వామి ఆలయం, పెంట్లం, అన్నపురెడ్డిపల్లి మండలం

బిల్లులు సమర్పించాం



నూతనంగా ధూప దీప నివేదన పథకం కింద ఎంపికైన దేవాలయాలకు పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు బిల్లులు సమర్పించాం. నిధులు త్వరలో మంజూరవుతాయని ఆశిస్తున్నాం. నిధులు మంజూరైన వెంటనే ఆయా దేవాలయాలకు కేటాయిస్తాం. త్వరలో పెండింగ్ నిధులు మంజూరవుతాయని ఆశిస్తున్నాం.

– ఎ.సులోచన, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

- ఒక్కరోజు ఆదాయం రూ.47,785

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 900 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.24,805, 450మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.22,980 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కిన్నెరసానిని సందర్శించిన కమాండెంట్


బోటుషికారు చేస్తున్న కమాండెంట్ రాఘవేంద్రరెడ్డి

కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని ఆదివారం హైదరాబాద్‌కు చెందిన గ్రేహౌండ్స్ కమాండెంట్ రాఘవేంద్రరెడ్డి సందర్శించారు. అనంతరం బోటు షికారు చేశారు. కమాండెంట్ వెంట ఎస్‌ఐ బి.శ్రీనివాస్ ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, 8 గంటలకు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలను సందర్శిస్తారు. 10 గంటలకు సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఫుడ్ పార్క్‌ను పరిశీలిస్తారు.

11న శిఖరాగ్ర సమావేశం

భద్రాచలంటౌన్: భద్రాచలంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల శిఖరాగ్ర సమావేశాన్ని ఫిబ్రవరి 11న నిర్వహిస్తున్నట్లు ఆట వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాస ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 33 జిల్లాల ఆట కార్యవర్గ సభ్యులు, సీనియర్ ఉపాధ్యాయుల సమస్యలు, భవిష్యత్ ప్రణాళికలతో పాటు ఆట నిర్వహించే సామాజిక కార్యక్రమాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.


ఉత్సాహభరితంగా అథ్లెటిక్స్ ఎంపికలు


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు భారీ స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 147 మంది బాలబాలికలు హాజరు కాగా, డీఈఓ సోమశేఖర శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ఎంపికలను ప్రారంభించారు. ఇటీవల జాతీయస్థాయి ఖేలో ఇండియా అథ్లెటిక్స్ మీట్‌లో 200 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించిన ఎ.గౌతమ్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా జట్టుకు ఎంపికైన అథ్లెట్ల వివరాలను కార్యదర్శి ఎం.డీ. షఫీక్ అహ్మద్ ప్రకటించారు. ఎంపికైన వారు ఫిబ్రవరి 10న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్ – 8 బాలుర విభాగంలో డి.అక్షాంశ్, చంద్ర, ఎం.వివేక్, టి.కృష్ణ, బి.హర్ష, అండర్ – 10 బాలుర విభాగంలో సోహిత్ చంద్ర, అండర్–12 లో డి.అనిల్ కుమార్, ఉపేక్షిత్, అవినాష్‌రెడ్డి, అండర్ –14లో బి.వెంకటేష్, ఆనందత్రిదేవ్ అండర్ –12 బాలికల విభాగంలో బి.రుతిక, ఆర్.అనన్య, పి.స్రవంతి, డి.నవ్య, అండర్ –14 బాలికల విభాగంలో సి.రిశ్వితశ్రీ, కె.అక్షయ, పి.నక్షత్ర ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు మందుల వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, సుధాకర్, కృష్ణయ్య, పీ.వీ.రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్యాక్స్ ప్రాక్టీషనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎఫ్‌టీపీ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు


శ్రీనివాస రావుతో జిల్లా సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్ : ట్యాక్స్ ప్రాక్టీషనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్(ఏఐఎఫ్‌టీపీ సౌత్ జోన్) చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాస రావు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఐదో వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించగా, శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాపార, పారిశ్రామిక వేత్తలతో పన్నులు కట్టిస్తూ ప్రభుత్వాల రెవెన్యూ పెంచుతున్న టాక్స్ ప్రాక్టీషనర్ల సేవలను గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ, ఇన్‌కం టాక్స్ చట్టాలతో ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వాటి పరిష్కార మార్గాలను తెలియజేశారు. సమావేశంలో అసోసియేషన్ సౌత్ జోన్ కార్యదర్శి చక్ర రమణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీజేకే కుమార్, ఏఐఎఫ్‌టీపీ సౌత్‌జోన్ మాజీ చైర్మన్ బి. సీతాపతిరావు, జిల్లా సంఘం గౌరవ అధ్యక్షులు బి.దుర్గాప్రసాద్, అసోసియేషన్ సలహాదారు చుండూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు సత్తుపల్లి జట్టు


క్రికెట్ జట్టుతో పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బి.వెంకన్న

ఖమ్మం స్పోర్ట్స్ : రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో భాగంగా నాలుగో రోజు ఆదివారం జరిగిన పోటీలో సత్తుపల్లి జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తుపల్లి – ఖమ్మం రూరల్ జట్లు తలపడగా మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఖమ్మం రూరల్ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. జట్టులో అనిల్ 34, గోపి 31 పరుగులు చేశారు. సత్తుపల్లి బౌలర్లలో శివరాం 4 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన సత్తుపల్లి జట్టు 13.2 ఓవర్లలో 116 పరుగు చేసి విజయం సాధించింది. జట్టులో మోసిన్ 49 పరుగులు చేశాడు. దీంతో సత్తుపల్లి జట్టు 4 వికెట్ల తేడాతో నెగ్గి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. రెండో మ్యాచ్‌లో కొణిజర్ల – వైరా జట్లు తలపడగా బ్యాటింగ్ చేసిన కొణిజర్ల జట్టు 112 పరుగులు చేయగా, ఆ తర్వాత బ్యాటింగ్ చేపట్టిన వైరా 90 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మ్యాచ్‌లను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ పీడీ డాక్టర్ బి.వెంకన్న, మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్, రషీద్, వెంకట ప్రసాద్, నరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.